# దీనిలో తప్పెవరిది?

శ్రీ అవ్వారి వాసుదేవశాస్త్రిగారు

అయ్యో! పాడుదైవమా! నన్నిట్లు బాధించుచున్నావే. నే నెట్టిపాపము చేసితిని. సన్న్యసమున్నగు నితరాశ్రమములలో నుండువా రెట్టి యిహలోక సుఖము గృహస్థు డనుభవించుచుండునని యూహించుచున్నారో అట్టి యైహిక సౌఖ్యము, పెండ్లియైనది మొదలు లేశమైనను ననుభవింపక పోతిని గదా! తక్కినయాశ్రమములవారు సంతానము కనుటకు వీలులేదు కనుక అన్నియాశ్రమములవారికిని గృహస్థుడే కారణము కావున నతడే యన్నియాశ్రమములవారిలోను ఉత్తముడు. (తేషాం గృహస్థో యోని రప్రజనత్వాదితరేషాం) అని సూత్రించిన మహర్షి యెవ్వరో కాని, అతడీసూత్రమును గృహస్థులను పరిహసించుటకే వ్రాసినట్లున్నది. "గృహస్థధర్మము చాల సంకటమైనది (సంకటా బహ్వపత్యానాం ప్రత్యవాయై గృహస్థతా)" వ్రాసిన కవీశ్వరుడెవ్వరో ఆయనమాత్రము నిజము మాటాడినాడు.

"ఋణానుబంధరూపేణ పశుపత్నీసుతాదయః" అను నీలోకప్రవాదము మాత్రము నిజమైనది సుమా! బొంతయు, కపాలమును దమసర్వస్వముగా నెంచుకొనుచు ఏ వాంఛయు లేక తిరుగుచుండు నా మహాత్ములగు యోగీశ్వరులే ధన్యులు. ఓహో! ఏమి పాపపరిణామము? చిన్నప్పటినుండి నేర్చుకొనుచున్నను పాకకళ స్వరూపము నీకు గోచరింపలేదుకదా! నీవంటిదానిని నాకు సహధర్మచారిణినిగా గూర్చిన దైవహతకుడు నిజముగా నాయెడ దనకోపము నంతయు బ్రదర్శించినాడుగదా! దీనికి అంతు ఎప్పటికి? దీని కేమేని హద్దైనను గలదా? ఇక నా యీ జీవితశేషమును గడపుట చాలా కష్టము." అని యిట్టి యమంగళ వాక్యములు బలుకుచు, నేను తఱచుగా తిట్టుటలో గల నైపుణ్యము నంతయును సంపూర్ణముగా బ్రదర్శించితిని.

సూర్యుడు నెత్తిమీదకు రాగా, ఎండచే తపింపజేయబడిన గువ్వలవలె అలసిపోయిన కాలుసేతులుగల నా పిల్లలందఱును ఆకలి తీర్చుకొనుటకు తొందరపడుచు, బుజ్జగింపదగినట్లుగా, ఆ సమయమునకు దగిన బాల్యచాపల్యము చూపుచు, వచ్చి చిత్తరువున వ్రాయబడిన బొమ్మలవలె చపలచేష్టల నన్నిటిని విడిచిపెట్టి క్షణకాలము వఱకు నావంకకే చూచుచు నిలువబడిరి.

నేను సంధ్యావందనమును పూర్తిచేసి కూర్చుండులోపల స్థలము పరిశుద్ధి చేసి విస్తరివేయబడినది. అన్నము వడ్డింపబడెను. చేతితో కప్పివైచిన కప్పుదగినంత వెడల్పు

గల అరటియాకునందు చేయి యుంచి, నేతితో దడిసిన వేడియన్నముతో ప్రాణాహుతులు వేసికొని, ఆకలిదయ్యమును పూజించుటకుఁ బ్రారంభించితిని. మొదటిముద్దను మ్రింగి యేదో పాకదోషముచేత నాలుక చెడను వెనుక జెప్పినరీతిగా మాట్లాడితిని. చిన్నప్పటినుండి పేదయింటఁ బెరిగిన నేను ఈ పాకదోష మేదియో యని యాలోచించియుఁ దెలిసికొనఁ జాలకపోయితిని. అట్టి పాకదోషమును వివరముగాఁ దెలిసికొనఁ జాలని నావంటి మిత్రులు కొందఱుందురుగాన ఈ విషయమున నభిప్రాయభేద ముండదని తలంచుచున్నాను. రెండేసి యేండ్ల వయస్తారతమ్యముగల నా పిల్లలందఱును, కఠినముగా మాటాడుచున్న నన్ను జూచి తమతమ యీడునకు దగినట్లుగా చేష్టలతో నస్పష్టముగా అభిప్రాయములను వెలిబుచ్చిరి. పదియేండ్ల యీడుగల పెద్దపిల్ల "ఏమిటి నాన్న యిట్లు పామరునివలె తనకు దగని మాటలను చెడుగా మాటాడుచున్నాడు" అని యనుచున్నట్లుగా, నా యందేదో అసహ్యాభావమును తల్లియందు కరుణను, పరితాపమును ముఖమునందు మారుచున్నరంగులతో సూచించెను. పిల్లవాఁడొకడు తీక్ష్ణమైన నాదృష్టిలో నుండ నిచ్చగింపక కాబోలు తలవంచికొని, దైన్యముతోఁ జూచుచున్న తల్లివంకకు సాభిప్రాయముగాఁజూచుచును, మఱియొక కుఱ్ఱవాడు అదరుచున్న పెదిమలతోను, చెక్కిళ్లను నల్లబఱచుచున్న కన్నీటిధారతోను ఆ యా భావములను బ్రకటించిరి.

ఇఁక నాభార్య మొగముననో, నిలుకడలేని చూపును, దీర్ఘముగు నిట్టూర్పును, కాలిబొటనవ్రేలిని తడుపుచున్న కన్నీటిధారయు, కొంచె మూహించుటకు వీలగు కనుబొమల ముడిపాటును ఒకదానినొకటి మించక సమానముగా నుండినవి.

ఆమె మాటలాడకూఱకుండుట నన్ను మఱింత పెచ్చుపెరుగునట్లొనర్చి మిక్కిలిగా వాగించినది. "నిన్ను నిందించి యేమి ప్రయోజనము? నీ తలిదండ్రులు, ఎవనిను పెండ్లాడుటకు పనికిరాని నిన్ను శూలమునకు దగినవాడు శ్రేష్ఠియే" యన్నట్లు నామెడకు గట్టి నన్నిట్టి దుస్తరమగు సంసారనరకములో బడవేసినారు. వారి ననిమాత్ర మేమి ప్రయోజనము? ఆడుపిల్ల నెవరికో యొకరికి మెడగట్టుట తలిదండ్రులస్వభావముకదా! ఎవడో యొకడు తగినవాఁడు దొఱకిన వారిపుణ్యము పండినట్లే

లెక్కపెట్టి వరదక్షిణ గలగల రాల్చ నక్కరలేదు. వధూవరుల కిద్దరికి నీయవలసిన ద్రవ్యమా - యీయ నక్కరలేదు. ఏడాదిలోపల తీసుకొనివచ్చి అల్లునికి చేయవలసిన సత్కారమా - అసలే లేదు. కార్యమునాఁడైనను గౌరవించి చేయవలసిన సత్కారవిశేషమా - అక్కఱలేదు. సీమంతోత్సవ సందర్భముననేని మిక్కుటముగా జేయవలసిన సన్మానాతిశయమా - అదియు లేదు. ఇట్టి సమయములందేకదా అల్లుండ్రు

ఇచ్చవచ్చినంత ధనము లాగికొని తమ మామగార్ల ధనపుపెట్టెలను ఖాళీచేయుచుందురు? అట్టి వేవియును మనకు లేవుకదా! పోనీ మంచిస్వభావమా లేదు. రూపశోభాసంపదయా మున్నే లేదు. అత్యుత్తమవంశమందుమా అదియును నంతగాఁ జెప్పఁదగదు. విద్యాసంస్కారము చూతమా - నీకును దానికిని చాల దూరము. ఇట్టియెడ నీయందు కుటుంబనిర్వహణశక్తి యేమికలదని మా తల్లిదండ్రులుచూచి నాకు నిన్ను పెండ్లిచేసినారో తెలియకున్నది. మిత్రుల మాటల ద్రోసివేసి, పెద్దల యుపదేశమును తిరస్కరించి కొడుకునైన నా యభిప్రాయమును లెక్కయే చేయక, విఘ్నముల నేమాత్రమును గణింపక, తమ యభిమానమునుగూడ చంపుకొని మావంశముయొక్క గౌరవసాంప్రదాయములనుగూడ శిథిల మొనర్చి నిన్ను నాకు పెండ్లిచేసిన ఆ నాతల్లిదండ్రులకు తృప్తి కలిగిన కలుగునుగాకఁ, కాని నీవలన నాకు మాత్రము తృప్తి యేర్పడదు.

భార్య అనుకూలురాలగుట, ఎంతో గొప్పపుణ్య మొనర్చినవారికి, గాని అందరికి లభించునా ? అట్లే ప్రతికూలురాలగుటయు నెంతో పాపమునకు ఫలము. నిన్ను పెండ్లాడినందున నింత రుచిగా భుజించుటకుఁ గూడ వీలులేకున్నదే! ఇంతకంటె పాప మేమున్నది ? నీ వంట యెవఁడు తినును ? కుక్కకుఁగూడ రుచింపదు. ఈ పండ్రెండేళ్లనుండి నా యింటనుండియు భర్తకేది యిష్టమైనదో తెలిసికొనజాలకపోతివి. అట్టిస్థితిలో నింతకంటె నేను కోరునదేమి యుండును ? తిండియే సరిలేనప్పుడు ఇంతకంటె నాయభీష్టమును నీవేమి తీర్చెదవు ? గృహస్థధర్మ మికఁ జాలును. పనులలో నేర్పరియై, తన కనుకూలురాలగు భార్య లభించినవాడే గృహస్థుఁడు. కాక నాబోంట్లందఱునా ? అని మఱల తిట్లగ్రంథములో రెండవ యధ్యాయమును బాడితిని.

ఈ నిందాగ్రంథమును నంతయు వినినను మాయింటావిడనోటినుండి యొక్క మాటయైనను వెలువడకుండుటచే "భర్త యెన్ని కఠినోక్తులాడినను నే వనితమనస్సు నొచ్చుకొనలేదో, తిరుగుజవాబు చెప్పదో, జవాబు చెప్పుటకుఁగూడ పూనుకొనదో, మెల్లగా గొణుగుచు భర్తమనమును కష్టపెట్టదో ఆవిడయే సరియైన భార్య" అని యావిడయందునాకు సద్భావముగలిగి వృద్ధి కాఁజొచ్చెను. కాని ఆవిడ యూఱకొన్నకొలదియు నాకోపముగూడ పెరుగజొచ్చెను. ఎన్నఁడో మంగలిముఖముచూచిన నాకీ సమయమున గగుర్పాటుగలుగుటయు, దానితోబాటు చెమటలుపోయుటయుఁ దటస్థించి యేదో బాధను గల్గించినవి. ఇట్టి దురవస్థలోనున్న నాతలయు గిరగిర తిరిగినట్లుండి యేమియు కులాసా లేదయ్యెను. ఆవిడతల్లిని, తండ్రిని, తల్లితరపువారిని, తండ్రివంశములోనివారిని ఎఱిగినంతవఱకు కఠినోక్తులతో దూషించి భాష చాలనందున తిట్టుటను

మానితినే, కాని ఓర్పుచేతగాని ఆమె క్షమించి కాని యూరకుండలేదు సుమా! ఇట్లూరకుండి భోజనము నెట్లో ముగించి చూతునుగదా పిల్లలందఱును భోజనముచేసి బడికి వెళ్లుచు కన్పించినారు.

నేనుగూడ కచ్చేరికి వెళ్లవలయును. సూర్యుడా? ఆకాశమధ్యమునకు వచ్చుచున్నాడు. ఇంక విశ్రమించుటకుం గూడ నవకాశములేదు. ఇంక తిట్టుటకిది సమయము గాదు. పనివేళ మిగులుచున్నది అని మిక్కిలి తొందరతో చొక్కాల బంకెనుండి చొక్కాను తీసి తొడుగుకొని త్వరగా బయలుదేరితిని. ఇంతలో మెల్లగావచ్చి తలుపు పట్టుకొని నిలుచబడిన మా యింటావిడ నోటినుండి "సాయంకాలము కచ్చేరినుండి తిరిగి వచ్చునప్పుడు వీలున్నచో, డబ్బున్నచో ఉప్పును కొనితెండు" అనుమాట వెలువడెను. ఈమాట, నేనింతవఱకును జూపినకోపమున కంతకును జవాబుగా నా చెవులలో మార్మ్రోగినది. చాలసేపాలోచించి, "ఉప్పులేకపోవుటచే గలిగినపాకదోషము కాని యిది మా ఆడువాండ్రది కాదు, ఆవిడతల్లిదండ్రులది కాని, నాతల్లిదండ్రులది కాని తప్పు కాద"ని తెలిసికొంటిని.

పాఠకమహాశయులీ తప్పెవరిదో తమలోం దాము మెల్లగా నాలోచించి చెప్పుడు.

——(o)——




స్త్రీల రోగ నివారిణి

| | |
|---|---|
| ఋతుశూల | హిస్టీరియా |
| మైల సరిగా కాకుండుట | శరీరము లావుబారుట |
| మైల అధికముగ వెడలుట | ఆయాసము |
| సంతానము లేకుండుట | తిమ్మిర్లు |
| శ్వేతప్రదరము | అజీర్ణము |
| రక్తప్రదరము | ఆకలి సరిగా లేకపోవుట |

మొదలగువానికి వరప్రసాదిని

తులం 1 కి రు. 4-0-0